# దర్పణం

● వసంతరావు దేశ్‌పాండే

మన రూపంతో మనం పరిచయం, ఆకర్షణ పొందాలని ప్రతిఒకరికిఉంటుంది. కాని ఆదియుగంలో నేటిలా దర్పణాలు లేవు. సుందరులు తమ సౌందర్యాన్ని నీళ్ళు నింపే సమయంలో చెరువులో, నదిలో వారి వారి ప్రతిబింబాలను చూసుకునే అంచనా వేసుకొనేవాళ్ళేమో.

నిజంగా దర్పణం లేని కాలాన్ని ఒక్క క్షణం ఊహించండి. ఎదుటివ్యక్తి అందంగా ఉన్నదీ లేనిది మనం మన కంటితో కనితెలుసుకొంటాం కాని మనం వారికన్నా అందంగా ఉన్నామా, వికారంగా ఉన్నామా అని తెలుసుకోవాలంటే....దర్పణం కావాలి. అంటే మన ప్రతిబింబాన్ని ప్రతిబింబించేది కావాలి.

ప్రపంచ చరిత్రలో మొట్టమొదట లోహ దర్పణాలు ఉన్నట్లు ఉల్లేఖించబడింది. జాగా మెఱుపుగల లోహదర్పణాలు ఉండేవని రోమ్ నాగరికత వలన తెలుస్తుంది. లోహాలపై మెఱుపుతెప్పించి వాటినే దర్పణాలుగా వాడేవారు. ఇప్పటికీ యిల్లాంటి దర్పణాలు, జపానులో అక్కడక్కడ కనిపిస్తాయి.

క్రీ. పూ. 400 సంవత్సరాల క్రితం యిల్లాంటి దర్పణాలు ఉన్నట్లు నిదర్శనాలున్నాయి. ఆనాటి కాలంలో ఈ దర్పణాలను అలంకారంగా, సౌందర్య రూపు రేఖలు దిద్దుకోవటానికే కాకుండా పెద్ద పెద్ద యుద్ధాలలో శత్రువులపై ఉపయోగించేవారు. వీటిని ట్రెంచ్ మిర్రర్స్ (Trench Mirrors) అనేవారు. బైబిలులో కూడ యిల్లాంటి లోహదర్పణాల ప్రసక్తి ఉన్నది.

దర్పణం ఆవిష్కరణ మొట్టమొదట ప్రాచ్య దేశాలలో సౌందర్య నగరమైన "వేనిస్"లో జరిగింది. లోహయుగంలో యిత్తడి, వెండి దర్పణాలు చేసేవారు.

దర్పణ నిర్మాణం క్రీ. పూ. 328 సంవత్సరములో 'ఫెక్సిపెలిస్' చేసాడని కొందరు. కాదు 'ప్లీని' చేసాడని కొందరు అంటారు. వీరిలో ఎవరుముందు దర్పణ నిర్మాణం చేసారన్నది చరిత్రకు అందని సత్యం, ఏదిఏమయినా గాజు దిమ్మకు ఒకవైపు మెఱుపుగల రేకువాడి అద్దాలను తయారు చేయడం అన్నది 13 వ శతాబ్దికన్నా ముందు లేదు. పదిహేడవ శతాబ్దిలో వేనిషియన్లు రేకుతో పాటు మెఱుగును ఉపయోగించి దర్ప

ణాలు చేశారు.

ఇంగ్లాండులో దర్పణాల వాడుక 1637 లో జరిగింది. అమెరికాలో లావాతో దర్పణాలు చేసేవారు. యూదులు కంచు (**Brass**) దర్పణాలు వాడేవారు.

భారత దేశంలో ప్రాచీన కాలంనుండి దర్పణాలు ప్రచారంలో ఉన్నాయి. సింధూ లోయల్లో ఇత్తడి, రాగి, కంచు దర్పణాలు లభించాయి. "హిందూ యికొనోగ్రాఫీ" మొదట్లో లోహ దర్పణాలు ఉన్నట్లు ఉల్లెఖించబడింది. 7వ శతాబ్ది గుప్తరాజుల కాలంలో బంగారము, ఇత్తడి మరియు రాగి దర్పణాలు ఉన్నట్లు వర్ణనలు లభిస్తాయి. కలకత్తా మ్యూజియంలో భద్రపరచ బడిన శిల్ప సుందరి– ఒకచేత దర్పణం ధరించి రూపు రేఖలను సవరించు కుంటున్నట్లున్న శిల్పం గుప్తరాజుల కాలం నాటిదని తెలుస్తుంది.

ధర్మశాస్త్రాను సారం దర్పణం చూడ్డం శుభ సూచకం. పూర్వకాలంలో ఏదయినా మంచి పనికి, రాజదర్శనానికి వెళ్ళేముందు– దర్పణం చూడడం రివాజు. పెండ్లయిన, నూతన (కొడుకు–కోడలు) వధూవరులను అత్తగారు మొట్టమొదటి సారిగా దర్పణంలో చూస్తుంది. ఈ వేడుకను మరాఠిలో "సూన్‌ముఖ్" (సూన్‌ముఖ్ అంటే కోడలి ముఖం అని అర్థం) అంటారు. మగ పెండ్లి వారికిదొక పెద్ద వేడుక.

తాంబూల సేవనానంతరం అద్దంలో ముఖం చూడ్డం మంచిదంటారు పెద్దలు. అందుకే ఎక్కడయినా కిళ్ళీ కొట్టులో ఎదురుగా పెద్ద అద్దం బిగించబడి ఉంటుంది.

వాత్సాయనుని కామసూత్రాల్లో "నాగరి ప్రకరణం"లో తాంబూల సేవనానంతరం దర్పణం చూడ్డం నిర్ణయించబడింది. వాత్సాయనుడు వ్రాసిన మానసోల్లాసంలో స్నానగృహాలను వర్ణిస్తూ అచ్చట దర్పణాలు ఉండాలని ఉల్లేఖించాడు.

మంగళ ప్రదమయిన వస్తువులలో దర్పణం గణనించబడిన కారణంగా ప్రాచీన కాలంలో (నేటికీ అక్కడక్కడ) నవ వధూవరులకు దర్పణం కానుకగా ఇచ్చేవారు.

'కుమార సంభవం'లోవివాహానంతరం పార్వతికి దర్పణం ఇవ్వబడినట్లు తెలుస్తుంది.

ప్రాచీన కాలంలో భారత దేశంలో పెద్ద పెద్ద దర్పణాలు ఉన్నట్లు నిదర్శనాలున్నవి. హర్ష చరిత్రంలో దర్పణం గురించి చాలా విశేషా లున్నాయి. మణి దర్శనాన్ని పూర్వం చికిత్సకు కూడా ఉపయోగించేవారు. హర్ష చరిత్రములో ఒక చోట ప్రభాకర వర్ధనుడు జ్వరతీవ్రతతో తల్లడిల్లి పోగా "వైదేహి" పేరుగలదాసి మణిదర్పణంతో చికిత్స చేసినట్లు తెలుస్తుంది. పూర్వకాలంలో శోభనం రాత్రి గదిని విశాలమైన అద్దాలతో అలంకరించేవారు. ఈ విషయం కూడా హర్ష చరిత్రములో ఉంది.

లక్ష్మి తన రూపాలంకరణకు శ్రీమహావిష్ణు యెదపైగల కౌస్తుభంలోచూసి సింగారించుకునేది. అంటే లక్ష్మి కౌస్తుభాన్ని దర్పణంగా వాడేది.

"అభిజ్ఞాన శాకుంతలం"లో ఒకచోట శకుంతల ప్రియసఖి ప్రియంవద శకుంతలతో 'దర్పణంపై దుమ్ము పేరుకు పోవడంతో ప్రతిబింబం చక్కగాకనిపించదు. తుడిస్తే కనిపిస్తుంది—అని అంటుంది.

తులసి రామాయణం (అయోధ్య కాండ)లో దశరథుడు యథాలాపంగా అద్దంలోకి చూసి యిలా ఆలోచిస్తాడు.

శ్రవన్ సమీప్ భయే సిత్ కేసా
మున్ హుఁ జరఠపున్ అస్ ఉపదేశా॥
నృప్ జుబరాజ్ రామ్ దేహు
జీవన్ జనమ్ లాహు కిన్ లేఁహు॥

భావం : చెంపల దగ్గర జుట్టు నెరసి పోతుంది. వృద్ధాప్యం సమీపించి "హే ! రాజా ! యువరాజు శ్రీరామ చంద్రునికి యువరాజాభిషేకం చేసి రాజ్య భారాన్ని అప్పగించి, శేష జీవితం భగవత్ స్మరణలో గడిపి ముక్తిని సాధించు"— అని కర్తవ్యాన్ని ప్రబోధిస్తుంది.

పూర్వకాలంలో దర్పణాలకు పాదరసం పూత వాడేవారు. పాదరసం పూత వేయబడిన దర్పణాలు చాలా ఖరీదయినవి. ఒక్కొక్క దర్పణానికి పూత పూయటానికి కొన్ని వారాలు పట్టేది. ఒక్కొక్క సారి ప్రాణాపాయం కూడా సంభవించేది.

ఈనాడు మనం వాడే దర్పణాలు చాలా సులభంగా తక్కువ వ్యవధిలో, తక్కువ ఖర్చుతో తయారవుతాయి. ఈ నాడు మన యిండ్లలో మామూలుగా వాడే దర్పణాలకు పూయబడిన పూత పాదరసం (పారా లేదా మెర్క్యురీ) కాదు. మెటాలిక్ సిల్వర్ పూత.

దర్పణాలు మూడు రకాలు: కుంభాకార 2. పుటాకార 3. సమతల దర్పణాలు.. కుంభాకార, పుటాకార దర్పణాలవల్ల ప్రతిబింబాలు లావుగా, పొట్టిగా, పొడవుగా నవ్వు పుట్టించేలా కనిపిస్తాయి. ఈ రకం దర్పణాలను జాతరలల్లో ప్రత్యేకంగా వినోదాన్ని కలిగించి పొట్ట చెక్కలయ్యేలా నవ్విస్తాయి.

నాట్య శాస్త్రానుసారం అరచేయి దర్పణంగా వాడతారు. అందుకే చాలామంది. ఉదయం లేవడంతోటే ముందు అరచేతిలో (దర్పణం అందుబాటులో లేని కారణంగా) ముఖం చూసుకుంటారు.

మనం రోజూ సవాలక్షసార్లు — పరికించి, పలకరించి, మిటకరించి, నవ్వి చూసుకునే దర్పణం వెనుక యింత కథా కమామీషూ ఉంది.